# బాల వికాసం



## మధ్యతరగతి బ్రతుకు

(కథ)

చలి గజగజ వణికిస్తోంది. సమయం ఉదయం 6గంటలు కావొస్తోంది.

"సంధ్యా! ట్యూషన్‌కి టైం అవుతోంది. తొందరగా స్నానం చేసిరా" అంది తల్లి.

"చాల చలిగా ఉందమ్మా! ఈ చల్లనీళ్ళ స్నానం చెయ్యలేను. కాసిని వేన్నీళ్ళు పెట్టమ్మా" ప్రాదేయ పడింది తల్లిని.

"ఈ రోజు కొత్తగా మాట్లాడుతున్నావేంటీ! ముందు చల్లగా అనిపించినా తర్వాత అలవాటైపోతుంది" అంటూ కసిరింది తల్లి. కూతురు చల్లనీళ్ళతో చెయ్యడానికి ససేమిరా అనటం, తల్లి అరుస్తూ స్వయంగా ఆమే చల్లనీళ్ళతో స్నానం చెయ్యించడం, ఆ పిల్ల లభోదిభోమని గోల చేస్తూ ఏడవడం పక్క వాటాలోవున్న అనసూయమ్మ వింటూనే ఉంది.

కాసేపటి తర్వాత ఆ తల్లితో అన్నది అనసూయమ్మ- "మనం ఎంత సంపాదించినా పిల్లల సుఖం కోసమే కదా. చలి బాగా వుంది. పొయ్యిమీద కాసిని వేడినీళ్ళు పెట్టకపోయావా" అని.

దానికామె- "ఏం చప్పను పిన్నిగారు! మా ఇద్దరి పిల్లలకైతే అలాగే పెట్టేదాన్ని. కాని ఈ మధ్య చనిపోయిన మా చెల్లెలు పిల్లలు కూడా మా దగ్గరే ఉంటున్నారు. మా పిల్లలకి వేడినీళ్లు పెడితే, మరి వాళ్ళకీ పెట్టాలి కదా. మా చాలీచాలని సంపాదనకి మాకీ స్తోమత లేదు" బాధపడుతూ చెప్పింది తల్లి.

"అయ్యో!.. మధ్యతరగతి బ్రతుకులు" అని మనస్సులో నొచ్చుకుంది అనసూయమ్మ జాలిగా.



-చలపాక ప్రకాష్
సెల్: 9247475975

## చెట్టు



చెట్టు చెట్టు మా ఇంటి చెట్టు
ఇచ్చు ఇచ్చు పండ్లను ఇచ్చు

చెట్టు చెట్టు ముచ్చటైన చెట్టు
పంచు పంచు చల్లని గాలిని పంచు

చెట్టు చెట్టు అందము నిచ్చే చెట్టు
పెంచు పెంచు ఇంటి అందం పెంచు

చెట్టు చెట్టు కలప నిచ్చు చెట్టు
ఇచ్చు ఇచ్చు వెలుతురు నిచ్చు

చెట్టు చెట్టు మంచి గాలినిచ్చు చెట్టు
పీల్చు పీల్చు చెడు గాలిని పీల్చు

చెట్టు చెట్టు బతుకు నిచ్చు చెట్టు
పెంచు పెంచు ఆయువును పెంచు

-కె. లేక్షిత
3 వ తరగతి, నారాయణ స్వామి స్కూల్
చిత్తూరు జిల్లా



## బాల గేయం

### ఆటల పాటల బాలల్లారా!

ఆటల-పాటల బాలల్లారా!
హాయిగ తిరిగే పిల్లల్లారా!
తెలివిగ అన్నీ గమనించాలి!
తేజంగా యిల జీవించాలి! ॥ఆ॥

కనబడకుండా మాటున చేరి
కాలనాగులా కాటేసే
'కరోనా' కదలివచ్చింది!
కావున బయటకు వెళ్ళొద్దు! ॥ఆ॥

బడులకు సెలవులు యిచ్చింది
పరీక్షల్ని మినహాయించింది
బయట తిరుగుటకు కాదని
గుర్తు చేసుకొని మెదలాలి! ॥ఆ॥

ఇంట్లో హాయిగ టీ.వి. చూస్తూ
పుస్తకాల్ని శ్రద్ధగ చదివేస్తూ
ఆకుచాటున పిందెల్లాగా
అమ్మచాటుగా మసలాలి! ॥ఆ॥



- డా॥ వద్దేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## విద్యార్థి విలువ

బయట్నుంచి ఓ ఉపాధ్యాయుడొచ్చి నీలో విద్యార్థిని చంపి ఆస్థానాన్ని ఆక్రమించుకున్నాడను. ఇక నీ సంగతి అంతే. నిలువనీటి గుంట లాగా మిగిలిపోతావ్ నువ్వు. లోపల విద్యార్థి ఉన్నంత వరకే సాఫల్యత సాగుతుంది నడక. విద్యార్థి మాయమయ్యాడా పురోగతి వేస్తుంది పడక. ఇది అందరికీ వర్తిస్తుంది. రాతగాళ్లకూ, నేతగాళ్లకూ, చేతగాళ్లకూ, కృషిని శ్వాసగా నిలుపుకున్నవాడే అసలైన విద్యార్థి. అసలైన విద్యారితోనే అవుతుంది అభివృద్ధి. విద్యార్థిగా ఉండటం మానేసి గిడసబారిపోయిన ఉపాధ్యాయులెందరో వున్నా ఆ వాస్తవాన్ని ఒప్పుకోరు వాళ్లు. కాబట్టి వాళ్లెందతో దురదృష్టవంతులు. లోపలి విద్యార్థిని బతికించుకున్నవాళ్ళే అదృష్టవంతులు.



- ఎలనాగ
సెల్: 8885563042



## వనజీవి

అతను
మొక్కల సంగాతకుడు ...
నిత్యం
మొక్కలను అక్కునచేర్చుకుంటూ ..
పుడమితల్లికి
పత్ర సమర్పణ చేస్తున్న
ప్రకృతి ఆరాధకుడు ...

విషపానం అమృత దానం
మొక్కల మహోన్నత లక్షణమంటూ ...
మొక్కలను సర్వత్రా పెంచుచున్న
మొక్కల నేస్తమితడు ...

పర్యావరణానికి తూట్లు పొడిచే
ముష్కర మూకలపై...
ఝంఝామారుతమై ఉద్యమించే
ఉద్యమకారుడు ..ఓ
మల్లేశం మాస్టారూ బోధనయే
మొక్కలపై
ఆరాధనా భావం కలిగించగా
ముదిమి వయసులో సైతం
నలుదిక్కుల కలియదిరుగుతూ ..
మొక్కల విశిష్టతపై నినదిస్తున్న
మహోన్నతుడు

నాలుగు దశాబ్దాల పాటు
అవిరామంగా శ్రమిస్తూ ..
మొక్కలే శ్వాసగా
మొక్కలే ధ్యాసగా
జీవన గమనాన్ని సాగిస్తున్న

మొక్కల రక్షకుడు ...

ఆకులో ఆకునై
పూవులో పూవునై
నునులేత రెమ్మనై అన్నట్లుగా ...
మొక్కల పరిచర్యయే
తనదిన చర్యగా మార్చుకున్న
అద్భుత మనీషి ...

చెరువు చెలక
గట్టు మిట్ట
ఊరువాడ అంతటా ..
ప్రాణదాతలైన మొక్కలకు
పాదులు కల్పిస్తూ ..
ఆరోగ్య భారతావనికి
అడుగులు కదిపిన
మొక్కల ప్రేమికుడు ...

కాలాన్ని ధనాన్ని
తన సర్వస్వాన్ని
మొక్కల పెంపకానికి ధారపోసిన ..
ధన్యజీవి ..
ప్రేమైకజీవి ..
జనజాగృతజీవి ..

(పద్మశ్రీ డా .వనజీవి రామయ్య గారు వస్పుల ఉన్నత పాఠశాలకు విచ్చేసిన సందర్భంగా ...)



-డా.బాదేపల్లి వెంకటయ్యగౌడ్
9948508939

## టమాట



తోటలోని టమాట
పచ్చనైన టమాట
ఎర్రనైన టమాట
చిట్టిపొట్టి టమాట
పచ్చడైన టమాట
పసందైన టమాట
అంగడిలోని టమాట
అందరు కొనే టమాట
అన్నీ కూరల్లో టమాట
అందరి ఇంటిలోని టమాట

- టి.శ్రీనాద్,
2వ తరగతి
బి.సి. మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల,
నెల్లూరు

## చిన్నోడు



చిన్నోడమ్మా.... చిన్నోడు...
చిన్న సైకిల్ కొన్నాడు
కొత్త బట్టలు వేశాడు
రోడ్డు మీదకు పోయాడు.
అటు ఇటు తిరిగాడు
రూపాయి బిళ్ళ దొరికింది.
కొట్టుకు చకచక పోయాడు.
అప్పలు కొని తిన్నాడు.
సంతోషంగా ఇంటికి వెళ్ళాడు.



-మహేష్,
1వ తరగతి
బి.సి. మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల,నెల్లూరు

## మంచి పుస్తకం

పుస్తకం పుస్తకం
మా మంచి పుస్తకం
రాతలు ఎన్నో రాశాను
బొమ్మలు ఎన్నో గీశాను
కథలు చక్కగా చదివాను
భాషలు ఎన్నో నేర్చాను
బహుమతులెన్నో గెలిచాను
బతుకును మార్చే పుస్తకం
బతుకునిచ్చే పుస్తకం
పేదలకు చదువును పంచే పుస్తకం
పుస్తకమంటే మాకిష్టం
చదవడమంటే మా అందరికిష్టం

-టి.శ్రీనాద్,
2 వ తరగతి బి.సి. మండల పరిషత్ప్రాథమిక పాఠశాల,
నెల్లూరు

## ఉడత



ఉడత ఉడత ఎక్కడికీ?
తోటలోకి వెళుతున్నా...
తోటలోన ఏముంది?
తోటలోన పండ్లున్నాయ్...
తోటలోన ఏమి పండ్లున్నాయ్?
జామ, మామిడి, దొండ పండ్లున్నాయ్
పండ్లను నీవు ఏమి చేస్తావ్?
పండ్లను నేను కొరికేస్తా....
కొరికిన పండ్లు నాకివ్వు
కొరికిన పండ్లు నీకెందుకు?
కొరికిన పండ్లతో పసందుచేస్తా...



- పి.ప్రకాష్,
2వ తరగతి
బి.సి. మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల,నెల్లూరు

## మా బడి



అమ్మ ఒడి లా జోల పాడు
కమ్మని కథలు చెప్పు బడి

నాన్న మనసుల హాయి నిచ్చు
ఇష్టమైన ఆటల నిలయం బడి

స్నేహితుడల్లే కబుర్లు చెప్పుతూ
చెలిమి పంచు చక్కని బడి

గురువు తోడులో ఆడేము నెమలిలా
కత్తి పడవలు చేసేము బడిలో

మా బడి ఆనందాల నిలయం
మా బడి అనుబంధాల నిలయం.

- కె.పర్ణిక శ్రీ
నారాయణ స్వామి హై భాకరపేట
5 వతరగతి

## మల్లెలు

మల్లెలు మల్లెలు మల్లెలు
మా పెరడులో విరిసిన మల్లెలు
బొండుమల్లెలు ముద్ద మల్లెలు
చెల్లెలి జడలో నాట్యమాడే

బొండు మల్లెలు ముద్ద మల్లెలు
అమ్మ శిఖలో నాట్యమాడే
బొండు మల్లెలు ముద్ద మల్లెలు

దేవుని మెడలో ముత్యాల దండలు
మా పెరటి మల్లెలు బొండుమల్లెలు
మల్లెలు మల్లెలు మల్లెలు

మా పెరడులో విరిసిన మల్లెలు
బొండుమల్లెలు ముద్ద మల్లెలు

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## సర్కార్ బడి ఆణిముత్యాలు- గుర్రాలగొంది మువ్వలు






భావి భారత నిర్మాణానికి బాలలు పట్టుకొమ్మలు. వారిలోని సృజనాత్మకతను గుర్తించి సాహిత్యం వైపు విద్యార్థులను కదిలింప చేస్తూ బాలసాహిత్యానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉపాధ్యాయులు తెలంగాణలో కోకొల్లలు. బోధన తో పాటు వాళ్లలో దాగిఉన్న రచనా పటిమను వెలికి తీసి సృజన వైపు నడిపిస్తూ ఎంతోమంది విద్యార్థులను కవులుగా రచయితలుగా తీర్చిదిద్దడంలో విశేషమైన కృషి చేస్తున్నవారు ఎంతోమంది ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పిల్లల కోసం పెద్దవారు రాసే స్థితి నుంచి పిల్లల కోసం పిల్లలే రాసే పరిస్థితికి రావడం ఇవాళ తెలంగాణలో ప్రవాహంల సాగుతున్న బాలసాహిత్యాన్ని చూస్తున్నాం. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు పుస్తకాలు రాసే పరిస్థితికి ఎదగడం మనందరికీ గర్వకారణం. ఇటీవల కాలంలోనే బాలచెలిమి ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో పది జిల్లాల వారీగా తెలంగాణ బడి పిల్లల కథలు రావడం జరిగింది. గత కొన్నేళ్ళుగా 'నేటినిజం' పత్రిక ప్రతివారంఒక పేజీ పూర్తిగా బాలసాహిత్యాన్నిప్రచురిస్తు బాల బాలికలను ప్రోత్సహిస్తోంది. ఇట్లా అనేక మంది రచయితలు, ఉపాధ్యాయులు పిల్లల సాహిత్యం కోసం కృషి చేస్తున్నారు. ఇటువంటి వారిలో సిద్దిపేటలోని గుర్రాలగొంది పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడి గా పనిచేస్తున్న వరుకోలు లక్ష్మయ్య ఒకరు . కవిగా, రచయితగా, గాయకునిగా నిరంతరం బాలల క్షేత్రంలో పని చేస్తూ వారిని సాహిత్యం వైపు మళ్లిస్తున్నారు. మాతృభాష అయిన తెలుగుపై మక్కువ కలిగేలా విద్యార్థులను సాన పడుతూ ఉన్నారు.

" గుర్రాలగొంది మువ్వలు" సంకలనంలో 82 మంది విద్యార్థులు బాల గేయాలు రాయడం జరిగింది. చిన్నప్పటి నుండి విద్యార్థులలో రచనా శక్తిని పెంపొందించడం వల్ల రేపటి సమాజంలో మంచి పౌరులుగా ఎదగ గలరు అన్నా అభిప్రాయం ఉంది. ఆ కోవలోనే గుర్రాలగొంది పాఠశాల విద్యార్థులు నడిచేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించడం చెప్పుకోదగిన విషయం. కొందరు రచయితలు ఉపాధ్యాయులు ఏదో పేరు కోసం పుస్తకాలు వేసుకొని పబ్లిసిటీ చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. కానీ మరికొందరు పిల్లల కోసం సాహితీ సృజన చేయడము గొప్ప విషయం. రెండో వరసకు చెందినవారు వర్కోలు లక్ష్మయ్య. బాలల చేత గేయాలు రాయించి ఈ సంకలనాన్ని తీసుకురావడం గొప్ప విషయం. ఈ సంకలనంలో ఆరో తరగతి నుండి పదో తరగతి చదివే విద్యార్థులు గేయాలు రాయడం జరిగింది. ఈ సంకలనానికి ముందు మాటలు రాసిన జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవి కాంతారావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ రెడ్డి, ప్రముఖ బాల సాహితీవేత్త డా॥పత్తిపాక మోహన్, సిద్దిపేట బాల సాహితీ వేత్త ఉండ్రాల రాజేశం, కథాశిల్పి ఐతా చంద్రయ్య, కథల తాతయ్య ఎన్న వెల్లి రాజమౌళి,సామలేటి లింగమూర్తి వంటి ప్రముఖులు రాయడము అంటే ఈ పుస్తకం యొక్క ఔన్నత్యం తెలుస్తుంది. డాక్టర్ రాధశ్రీ గారు 82 మంది విద్యార్థుల పేర్లకు తగ్గట్లుగా కంద పద్యాల మాలికలు రాయడం మరింత బలోపేతం చేకూరి నట్లయింది. ఈ సంకలనంలో ప్రతి గేయం అలతి అలతి పదాలతో పాడుకోవడానికి అనువుగా ఉన్నాయి. ముఖ్యంగా ఏ శుభ కార్యం చేపట్టిన ముందుగా వినాయకుని పూజ చేయడం ఆనవాయితీ. అలాగే ఇందులో కూడా ముందుగా వినాయకుడు అనే మొదటి గేయంలో...

**"చెరువులో మట్టి తేవాలి/ ముద్దుగా ముద్ద చేయాలి/ ఇంటికి తీసుకు రావాలి/ వినాయకుని చేయాలి/ రంగులు ఎన్నో పూయాలి/ ఇంటింటికి పంచాలి...... ఊరేగింపు తీయాలి/ చెరువులు వేసి రావాలి"** అంటూ ఏడో తరగతి చదివే అర్చన పర్యావరణం భావనతో వినాయకుని పండుగ విశిష్టతను చక్కగా వివరించింది. అలాగే పదవతరగతి చదివే వనజ **"అందాల పల్లె" శీర్షికన... రండి రండి పిల్లలు /రండి రండి బాలలు/ అందాల పల్లెను చూడ మీరు రండి"** అంటూ పల్లె సీమ అందాలను అవపోసన పట్టిన విధంగా తెలియజేసింది. అదేవిధంగా దర్జీ అనే గేయంలో బట్టలు కుట్టే విధానం గురించి ఆర్ శ్రావణి చక్కగా వివరించింది. గ్రంథాలయము గేయంలో... సరస్వతి నిలయము, గ్రంథాల భాండము, జ్ఞానం ఎంతో పెరుగును, గ్రామానికి గ్రంథాలయము అని గ్రంథాలయం యొక్క ప్రాధాన్యత తెలియజేసింది. తెలుగు భాష అనే ఇంకొక గేయంలో... తీయనైన తెలుగు భాష, తీపి మనము గ్రో లాలీ, ఆంగ్ల భాష తెలుగు భాష అవియు రెండు నేర్వాలి అని భాషల విశిష్టతను కీర్తన ఎరుక చేస్తుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గేయము వివరించ తగినది. బడి (అనూష పదవ తరగతి), చెరువు (ప్రశాంత్ పదవ తరగతి), కాలుష్యం (ప్రత్యూష), ప్లాస్టిక్ (ప్రవళిక), కలలు (అరుణ్), గుడి (కోటగిరి భరత్), సెలవులు (అరవింద్), సైనికుడు (నవీన్), గీత కార్మికుడు (అంజద్), ఆకాశం (అరవింద్), గంగా నది( ప్రదీప్), అమ్మ (దూలం సాయి), రైతన్న (మోహన్ సాయి), రైలుబండి (వైష్ణవి), విమానము (సుమన్), తాళం( నరేష్), సోమరితనం (గడ్డం ప్రవీణ్), దేవుడు( హరీష్), ఫ్యాను (వర్షం), బస్సు (మనీషా), చీమలు (నందిని), చిరుతిండ్లు (కవిత)' బాల కార్మికుడు (అజయ్), రాయి (బాలాజీ), విద్య (శిరీష), బతుకమ్మ (దీపక్), జనాభా (కీర్తన), వాన (శృతి), తాత (భాగ్య), ఇంకుడు గుంత (వైష్ణవి), భారతదేశం (ప్రత్యూష), పెళ్లి భోజనాలు (రోజా), ఓటు (స్నేహ), పరీక్షలు (లహరి), సీతాకోకచిలుక (వ ర్షిత్), దేవుడు (మాధవి), ధనము (ప్రశాంత్), నగలు (సుష్మ), బ్యాటు( అఖిల్), చలి (శివ మంత్), కోలాటం (వంశీ), పుస్తకం (ప్రణీత్) సైకిల్ (మధు), మా వూరు శ్రీజ..... ఇలా ఎందరో విద్యార్థులు తమకు నచ్చిన అంశాలమీద గేయాలు రాయడం జరిగింది. ఇందులోని ప్రతి గేయాన్ని పాటల రూపంలో పాడే అవకాశం ఉన్నది. సంపాదకులు గాయకులు అయినందున పిల్లలకు తరగతి గదిలో వినసొంపుగా పాడించవచ్చు.

గుర్రాలగొంది మువ్వలు సంకలనానికి చక్కటి ముఖ చిత్రము గీసిన మరి పెల్లి రమేష్ అభినందనీయుడు. ముఖచిత్రం ఎంతగానో ఆకట్టుకునే విధంగా ఉంది. పుస్తకంలో ప్రతి గేయానికి సంబంధిత బొమ్మ, ఆ గేయం రాసిన విద్యార్థి పేరు, ఫోటో ఉండడము గొప్ప విషయం. ఈ పుస్తకం పిల్లల మదిలో నిలిచి ఉండే ఓ జ్ఞాపకం. ఈ పుస్తకం రూపంలో సంతరించుకోవడానికి సహాయ పడిన గుర్రాలగొంది ఉపాధ్యాయులు నిజంగా అభినందనీయులు. ఒక ఉపాధ్యాయుడికి పేరు వస్తుంది అంటే మిగిలినవారికి కుళ్ళు ఉంటుంది. కానీ ఈ పాఠశాల ఉపాధ్యాయులు సమిష్టిగా వ్యవహరించి ఈ సంకలనం సమాజానికి అందేవిధంగా కృషి చేయడం వారి దూరదృష్టికి సంకేతం. 104 పేజీలతో, 82 గేయాలతో ఉన్న గుర్రాలగొంది మువ్వల సంపుటి ఇతర పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం. ఈ బాల గేయ సంపుటిని తెలంగాణలోని అన్ని ఉన్నత పాఠశాల గ్రంథాలయాలకు చేరవేసే విధంగా, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని, అప్పుడే మిగిలిన విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని భావించవచ్చు. ఇంతటి యజ్ఞాన్ని విజయవంతం చేసిన సంపాదకులు వరుకోలు లక్ష్మయ్యను అభినందిస్తూ, వారి మార్గదర్శకత్వంలో బాలలు బాలసాహిత్యంలో రాణించాలని కోరుకుంటున్నాను.

- కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి,
సెల్ :9441561655.

## చాక్లెట్



తియ్యనైన చాక్లెట్
పిల్లలు నచ్చే చాక్లెట్
నోరు తీపి చేసే చాక్లెట్
పుట్టినరోజుకి పంచే చాక్లెట్
పిల్లలు కొనే చాక్లెట్
ప్రియమైన చాక్లెట్
రంగురంగుల చాక్లెట్
అందరికీ నచ్చే చాక్లెట్
ఎక్కువ బాగా తిన్నారంటే
పళ్ళు పుచ్చును తొందరగా...



-టి.హర్షవర్ధన్,
2వ తరగతి
బి.సి. మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల,నెల్లూరు

## సైకిల్



సైకిల్ సైకిల్ , చిన్నారి సైకిల్
శీనుగాడి సైకిల్ , చిత్రమైన సైకిల్
ఛల్ ఛల్ సైకిల్, చిట్టిపొట్టి సైకిల్
చలాకి సైకిల్ , చిన్ని సైకిల్
చౌకైన సైకిల్ , చిక్కలేదు సైకిల్
చందమామ సైకిల్ , సొంపైన సైకిల్
ట్రింగ్ ట్రింగ్ సైకిల్ , చిన్నాన్న సైకిల్
టిక్కు టిక్కు సైకిల్, తొక్క లేని సైకిల్



- టి.శ్రీనాద్,
2వ తరగతి
గుట్టిగుండాల
బి.సి. మండల పరిషత్
ప్రాథమిక పాఠశాల,నెల్లూరు

## సహనం

(కథ)



-దారం గంగాధర్
సెల్: 9848384777

బహుశ అప్పటికి అర్థ రాత్రి దాటి యుంటుంది,తలుపులు దబ దభ బాదుతూ బిగ్గరగా కేకలేస్తున్నాడు భర్త నరసింహం. అతని గొంతులో జీవం లేదు. మత్తులో అరచి నట్లుంది. ఇది భార్య తులసికి నిత్య భాగోతమే, పూటుగా తాగొచ్చి"ఒసే తులసీ తలుపు తీయవే"అని కేకే లేయడం.

రోజు మాదిరే ఆనాడు కూడా కళ్ళలో వత్తులేసు కొని ఎదిరి చూస్తోంది భర్త రాక కోసం. అంతలోనే భర్త కేక విని ఒక్క పిలుపుకే తలుపు తీసింది తులసి, తలుపు తీసి తీయక ముందే బ్యాలన్స్ తప్పి తన మీదే పడ్డాడు నరసిహం. లేని సత్తువ తెచ్చుకొని భర్తను కింద పడనీయ కుండా అదిమి పట్టి పక్కనే ఉన్న కుక్కీ మంచంలో పడుకో బెట్టి తలుపులేసొచ్చి , తమ ఇద్దరు పిల్లలు తినగా మిగిలిన గిన్నెను గీరితే వచ్చిన మెతుకులు రెండు ముద్దలను తప్ప తాగి మైకంలో ఉన్న భర్తకు ఎలాగో అలాగా తినిపించింది. తాను మాత్రం గ్లాసెడు నీళ్ళు తాగి తొంగుంది.

ఇది రోజూ షరా మామూలే. నరసింహం రోజూ కూలీ కెళ్తాడు, కాని వచ్చిన కూలీ డబ్బంతా తన తాగుడు తం దానాలకే సరి పోయేది. అదేదో ఏనుగు మోసెంత తెచ్చుకొని ఏనుగేతిన్నదన్నట్టు, నరసింహం దీ అంతే. కేవలం తులసి కుట్టుమిషన్‌తో బట్టలుకుడితే వచ్చే ఆదాయమే వారి పొట్ట గడవడం తప్ప మరోటి లేదు.

ఉన్న ఇద్దరు పిల్లలు బడికి వెళ్ళేవారు. అబ్బాయికి 10, అమ్మాయికి ఆరేండ్లు. అతికష్టం మీద పిల్లల్ని ప్రభుత్వ బడిలో చదవిస్తోంది తులసి . డ్రెస్సుల లాంటి అదనపు ఖర్చులకు సెలవుల్లో కూలికెళ్ళి సమకూర్చు కొనే వారు పిల్లలు.

తాగి తందానాలాడే నరసింహం భార్య మీదే కాక పిల్లల మీద కూడా చెయ్యి చేసుకునే వాడు.

పిల్లలు పెద్ద వాల్లయ్యారు,తను చేసే పని రాబడి సరిపోక నానా ఇబ్బంది పడు తోంది తులసి. అతి కష్టం మీద సంసారం నెట్టుకు పోతోంది .

చీటికీ మాటికి చిర్రు బుర్రులాడే నరసింహంకు బీపీ పెరిగి పక్షవాతం వచ్చింది. అదేదో మూలుగే నక్క మీద తాడి పండు పడ్డట్టు దరిద్రం తాండ విస్తున్న సంసారానికి కష్టాలు సుడి గుండంలా చుట్టు కున్నాయి.

అటు తిండికి ఇటు వైద్యానికి డబ్బు లేక నానా ఇబ్బందులు మొదలయ్యాయి. 1

తప్పని పరిస్థితుల్లో పెద్దబ్బాయి నీ బడి నుంచి రాగానే రాత్రుల్లో రిక్షా తోలడానికి పంపిస్తోంది. వాడి సంపాద ననే కాస్త ఊరటనిచ్చింది. ఇలా కొన్నాళ్ళు పోగానే పెద్దబ్బాయి కూడా వాడి నాన్న తోవలో నడవడం మొదలు పెట్టాడు. వీడు కూడా తప్ప తాగి ఏ అర్థ రాత్రి కో కొంప కొచ్చేతవాడు. తల్లితో పలు మార్లు గొడవ పడే వాడు కూడ. ఇది గమనించిన తులసి ఓపిక నశించి చీవాట్లేసి ఓ చెంప దెబ్బ తీసిందొకనాడు. దానికి బదులు తన తల్లి మీదే చెయ్యేసుకోబోయాడు కొడుకు. కుక్కి మంచంలో పడిఉన్న నరసింహం ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. తనలో చెప్పరానంత ఉక్రోషం తన్నుకొస్తోంది. అతనిలో ఏదో మార్పు వచ్చినట్టుంది. బిగ్గరగా కేక వేస్తూ" ఒరెయ్ దరిద్రుడా బంగారం లాంటి దేవత మీదికి చేయెత్తు తావురా? తులసీ నిజంగా భూదేవిరా ఎంత ఓపిక రా" అంటూ ఉన్నపళంగా లేచి భార్యను చేరాడు. అతనిలో జరిగిన మార్పుతో అందరూ విస్తుపోయి చూస్తున్నారు. మందుల ప్రభావమో, భార్య మీదున్న అనురాగమో గాని నరసింహం కున్న పక్ష వాతం పటా పంచలై మామూలు మనిషై పోయాడు.

అటు కొడుకు కూడా పశ్చాత్తాప పడుతూ "అమ్మా!నన్ను క్షమించు అమ్మా తప్పై పోయింది" అంటూ తల్లి పాదాలపై పడ్డాడు.

"తులసీ! నన్ను క్షమించవా? నాకు బుద్ధొచ్చింది, నిన్ను అర్థం చేసుకొలేక పశువులా ప్రవర్తించాను, ప్లీస్ నీ సహనం ఎంత గొప్పదో" అంటూ ఆమె చేతులు పట్టు కొని బతి మాలుకొంటున్నాడు నరసింహం. ఇదంతా ఏమీ అర్థం కాక బిక్క మొఖం వేసుకుని చూస్తోంది తమ పదేళ్ల కూతురు శాంతి.

## నానీలు

చైనా లోపుట్టింది
దావా నలం
విశ్వాని కంతటికీ
హాలా హలం

నోరు మూసుకో
ముక్కూ మూసుకో
చేతులూ సరి చూసుకో
కరోనా భయం

చేతులు కలపకు
పక్క పక్కనే నడవకు
మాస్క్ నీ మరువకు
కరోనా కోసం

చైనాలో పుట్టింది
ఇటలీని ముంచింది
విశ్వవ్యాప్తమైయింది
కరోనా

విశ్వమే వణుకు తుంది
యుద్ధాలతో కాదు
విద్వేషంతో కాదు
కరోనాతో

విశ్వమంతా
ఏకమైయింది
కరోనా ముందు
మోకరిల్లింది

-ఆచార్య గిడ్డి వెంకట రమణ
9440984416

     

## ఇంట్లోనే ఉండాలి

సింహం అలికిడికి
పొదల్లోకి గెంతిన
జింకల్లా

గద్ద నీడకదిరి
బిలంలోకి దూరిన
పాములా

పాము నోటికి
చిక్కకుండా కలుగుల్లో
దాక్కున్న ఎలుకల్లా

గద్ద నోటినుండి జారి
తల్లి పెట్ట పొదుగులో
బిగుసుకు పోయిన
కోడిపిల్లలా

కరోనా రక్కసి
కోరలు పెకిలించ
గూడులోనే
పదిలంగా ఉండాలి.

అదునుకోసం
వేచి ఉన్న సింహాల్లా
ఇంట్లోనే ఉండాలి



-డా.దార్ల రాఘవేంద్రా చారి
9492991636

## క్షణాల సైన్యంలో!

అదుపులేక వెర్రి గుర్రాలు
రథాన్ని అడ్డదిడ్డంగా లాగినట్టు
అతి విశ్వాసముతో
విచ్చలవిడిగా విహరంజేస్తూ కాలం!
క్షణాల సైన్యంపై దాడిజేసి
కాలం ఆయువులోకి సైతానొకటి
సూక్ష్మంగా పెనవేసుకుని
శూన్యములో ప్రేతంలా తిరుగుతోంది!

దశతక్కువ మనిషిలో జేరి
శబ్దపు ఉలిపిరి చినుకుల జడితో
దరిజేరిన వారి శ్వాసకు ఉరివేస్తుంది
ఊపిరాపి ఆయువు తీసేస్తుంది!

జతకూడి ఉరికొయ్యకు మేతయ్యేకన్న
విషకాలపు గుర్రాలకు కళ్ళెం గట్టేవరకు
కాలపాశంలోని సైతానుని మాయంజేసేవరకు
దూరదూరపు నడకలు సుఖమేమో!

కాలాన్ని కట్టడిజేసుకొని
రాలిన బంధాలకి మారాకులేపించడం
వీడిపోనంతగా బలంగా అల్లుకుపోవడం
అందివచ్చిన వసంతాన్ని ఆస్వాదించడం!

ప్రేమపూతలుమెక్కి పొదరింటి పసికూనలు
కోయిలలై కూసే కూతలు విని ఆనందించడం
విరబూసిన ప్రేమానురాగల నిశ్వాసాల
పరిమళగంధాన్ని ఆయువుగా తీసుకోవడం!

ప్రాణాలుదీయు సూక్ష్మజీవులకి తలొగ్గని
ఆప్యాయతల శ్వాసకోశాలు పెంచుకోవడం
మనస్సున్న ప్రతి మనిషికీ
లాక్డవున్లో అనుభవంలోకి వస్తుందేమో!

-రవి కిషోర్ పెంట్రాల

## ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలం

మీ మెడలోని స్టెతస్కోపు వైజయంతి మాలలా
మీదరహాసం చల్లనివెన్నెలలా
మీకరస్పర్శ చంటిపాపకు అమ్మస్పర్శలా
మీ మధురవాక్కు ఆదేవుని ఆశీర్వచనంలా
మీ తెల్లనికోటు ఒకపీతాంబరంలా
మీ రూపే అపర ధన్వంతరిలా అగుపిస్తుంది
సుశ్రుత చరకుల వారసులై
కుటుంబం కంటె దేశం ముఖ్యమంటూ
విలాసాలను కాసేపు పక్కనబెట్టి
భూలోకాన్ని గడగడలాడిస్తున్న కరోనాసురునిపై
పోరుకు విష్ణుమూర్తి మరో అవతారంగా
ఇలకు దిగివచ్చిన వైద్యనారాయణులారా
ఏమిచ్చి మిత్యాగానికి వెల కట్టగలం
ఒక చిన్న అభివందనం తప్ప
కంటికి రెప్పలా రుజాగ్రస్తుల రక్షిస్తూ
వారి సేవలో తరిస్తున్న నర్సులారా
ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలం
ఒక చిన్న అభినందన తప్ప.

ప్రపంచానికే గడియపడ్డ నేడు తనకేమవుందనే
చింతలేక రుజాగ్రస్తులకు ఏమీకావద్దని
సేవిస్తున్న నర్సులరా
ఏమిచ్చి మీఋణం తీర్చగలం
ఒక్కచిన్న ప్రశంస తప్ప.

రోజురోజుకూ కేసులు పెరుగుతున్నా తనకేమైనా చింతలేదు
ప్రజలంతా ఇంట్లో ఉంటే చాలంటూ
హలాహలాన్ని మింగిన పరమేశ్వరునిలా
రక్షక విధులు నిర్వహిస్తున్న రక్షకభటులారా
ఏమిచ్చి మీఋణం తీర్చుకోగలం
ఒక్కచిన్న వందనం తప్ప.

కంపుగొట్టే చెత్తతో తమ ఆరోగ్యానికేమవుతుందోనన్న
చింతలేక సమాజ రక్షకై
చేత చీపురునే శ్రీరాముని కోదండంలా ఎక్కుపెట్టి
కరోనాసురునిపై స్వచ్ఛాస్త్రం సంధిస్తున్న సచ్ఛకార్మికులారా
ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలం
ఒక చిన్న ప్రశంస తప్ప.

అంతే కాదు...
వీరందరిని సేవించే రక్షించే
అవకాశం మన చేతుల్లోనే ఉంది
అదే.. గృహ నిర్బంధం.
అవును మనకు మనం
స్వీయనిర్బంధంలో ఉండటమే
వీరందరి ఋణం తీర్చుకునే
మహదవకాశం.



-రాంనరేష్ కుమార్
9492682285

## మధురవాణి

మోసం కన్నా స్నేహం మిన్న
నమ్మించి మోసం చేయుట తప్పన్నా
నమ్మించినవాడు నట్టేట ముంచును అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

కత్తి కన్నా వజ్రము మిన్న
వజ్రముకున్న పదును వాడికత్తికి లేదన్నా
వజ్రమును వజ్రముతోనే కోయవలెను అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

కాకి కన్నా కోకిల మిన్న
రంగులు ఒకటైనా స్వరాలు వేరన్నా
కోకిల కంఠం మధురముగా ఉండునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

రాజుల ధనం రాళ్ళ ఫనం
రాజులధనం పరుల పాలని నమ్మన్నా
రాజుల సొమ్ము రాళ్ళ పాలని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

మొక్క చిన్నది మ్రాను పెద్దది
మొక్కను వంచుట తేలికని తలచన్న
మొక్కైవంగనిది మ్రనై వంగునా అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

చెప్పుట మాని చెరుపుట పూని
చెరుపుటకు పూనుట తప్పని తలచన్న
చెరపకురా చెడెదవు ఉరకకురా పడెదవని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

చేపకు ఈత నీళ్లలో మోత
చేపకు నీళ్లే నిలయమని తలచన్న
చేపపిల్లకు ఈత నేర్పవచ్చున అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

ఇతరులమాట కన్నా తనమాటే మిన్నని
తనమాటే మిన్నని గొప్పలు వద్దన్నా
తానుపట్టిన కుందేలుకు మూడే కాళ్ళ ని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

తన నీడ తనకు పీడ
నీడనుచూసి పీడగ భావించుట తగదన్నా
తననీడ ఛాయ తనకుపీడ కాదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

అందం కన్నా ఆనందం మిన్న
అందము తోనే ఆనందమని తలచన్న
అందమే ఆనందం ఆనందమే జీవితమని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

కృషిని మరిచి సుఖము వలచి
కృషితోనే ఫలితము అని తలచన్న
కృషిఉంటే మనుషులు ఋషులు అవుతారని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

పసిడి కన్నా పసుపు మిన్న
పసుపువలన మనకు ఎంతో మేలన్నా
ముత్యమంత పసుపు ముఖఃమెంతో మెరుపని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

చిత్రాలు భళా విచిత్రాలు అలా
చిత్ర విచిత్రాలు గొప్పవని తలచన్న
చిత్రం భళారే విచిత్రం అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

గంధం ఉంటే అందం ఉండు
గంధంవలన అందం పెరుగునని తలచన్న
గంధంతోనే చక్కని అందం అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

మూడునదుల ముచ్చట కలియు అచ్చట
మూడు నదులు కలియుట గొప్పన్నా
గంగా యమున సరస్వతి త్రివేణిసంగమాలని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

సంసారి తిరిగి సన్యాసి తిరగక
సంసారి సన్యాసి వేరువేరని తలచన్నా
సంసారి తిరిగిచెడును సన్యాని తిరగకచేడునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

సముద్రం గొప్పదా సహనం గొప్పదా
సముద్రంకన్నా సహనం గొప్పని పొగడన్నా
సముద్రం కన్నా సహనం మిన్నని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

సంగీతం వేరు సాహిత్యం వేరు
సంగీతం సాహిత్యం వేరువేరని తలచన్నా
సంగీతానికి చింతకాయలు రాలున అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

కోటి దరిద్రాలు కోటి ఉపాయాలు
దరిద్రానికి విరుగుడు ఉపాయాలని తలచన్నా
సవకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా

సన్యాసి ఒకరు సన్యాసి మరొకరు
సన్యాసి సన్యాసి వేరువేరని తలచన్నా
సన్యాసిసన్యాసి రాసుకుంటే బూడిద రాలునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్నా.



-మేకల లింగమూర్తి,
9573284788

## మొగ్గలు

వికారి నామ సంవత్సరం వెళ్తూనే
వికారమైన రోగమును ఇచ్చింది
విధి నిర్ణయాన్ని దాటలేరెవరు.

పండుగ జేయనీయకుండా
పాపిష్టి కరోనపలువురిని పొట్టన పెట్టు కుంది
ప్రజలపాలిటి పగపెంచుకున్న కరోన.

కవిసమ్మేళనాలు లేకుండానే
ఉగాది పచ్చడి కవులు తాగింద్రు
గరళ కంఠులు కవివరేణ్యులు .

కరోనాను కట్టడి చేస్తామంటూనే
కవితాస్త్రాలను సందిస్తారు
బ్రహ్మాస్త్ర ధరులు కవిబ్రహ్మలు.

- ఆర్ .చెన్నయ్య
9441615293

## మానవత్వం పరిమళిస్తోంది

మానవత్వం పరిమళిస్తోంది
విపత్కర పరిస్థితుల్లో
జాతి కుల మత ప్రాంతీయ
భేదాలు లేక
ధనిక పేద వర్గ వివక్ష లేక
అందరూ ఏకమై
మానవతా పథంవైపు
అడుగులు వేస్తున్నారు
రెక్కాడితే గానీ డొక్కాడని
బుడుగు జీవులు సైతం
మేమున్నామంటూ
ఆపన్నహస్తం అందిస్తున్న వేళ
మాన వత్వం గుబాళిస్తున్నది
పగలు లేవు ప్రతీకారాలు లేవు
కుళ్ళు కుతంత్రాలు లేవు
అందరిదీ ఒకటే ధ్యేయం
యుద్ధం
ఆయుధాలు లేని యుద్ధం
ధరణిని కాపాడుకోవటం
విశ్వ రక్షణే ధ్యేయంగా
ప్రతి ఒక్క వ్యక్తి
ఒక సైనికుడై
కోవిడ్ తో సమరానికి
సిద్ధ పడుతూ
ఐక్యతకై పాటుపవడుతున్న వేళ
మానవీయ విలువలు
చిగురిస్తున్నాయి

-వి.వి.యస్ కృష్ణ కుమారి
యాంజాల

## వినిపించుకోండి జర...

వినిపించుకోండి వినిపించుకోండి
కరోన కేకలు వినిపించుకోండి
వినిపించుకుంటే మిగిలిపోతార
వినిపించుకోకుంటే మాయమౌతారు
వినిపించుకోండి వినిపించుకోండి
పెద్దల మాట వినిపించుకోండి
వినిపించుకుంటే బాగుపడ్తారు
వినిపించుకోకుంటే భజార్నపడ్తారు
వినిపించుకోండి వినిపించుకోండి
పోలీసోళ్ల మాట వినిపించుకోండి
వినిపించుకుంటే బతికి బయట పడతారు
వినిపించుకోకుంటే ఉతికించుకుంటారు
వినిపించుకోండి వినిపించుకోండి.
డాక్టర్ల మాట వినిపించుకోండి
చికిత్స చేస్తుంటే సహకరించండి
వినిపించుకుంటే బతికిపోతారు
వినిపించుకోకుంటే భూమికి భారమౌతారు
వినిపించుకోండి వినిపించుకోండి
ప్రభుత్వం మాట వినిపించుకోండి
సమాచారాన్ని సరిగ్గివ్వండి
స్వచ్ఛందంగా వచ్చి పరిక్ష చేయించుకోండి
వినిపించుకుంటే ఆధార్ లో వుంటారు
వినిపించుకోకుంటే ఆగమౌతారు
అందుకే మరి జర వినిపించుకోండి.



-ఎ. ఎమ్. జయశీల
సెల్: 8374269508

## కరోనా నేర్పిన కొత్త సంప్రదాయాలు

అగ్రరాజ్యంలో పుట్టాననే గర్వం నీది
బలహీనులు మీరేం చేస్తారనే పొగరుబోతువి
అహంకారం కమ్మిన కంటి చూపులు నీవి !

లోకం కమ్మిన కరోనా గత్తర మబ్బులు
ప్రపంచమంతా మరణమృదంగాలు
కాచుకొని కబళించాలనే క్రూర విషకోరలు !

లోక తలుపులకు లాక్డౌన్ తాళం కప్పలు
స్వీయబంధీలై గూట్లో తొంగున్న కుటుంబాలు
కట్టడికే ఆయుధాలైన కొత్త సంప్రదాయాలు !

అంటనానితనం ఘోరనేరం ఆనాడు
తాకితే ప్రాణగండం అంటున్నారీనాడు
కరచాలనమే సంస్కార హేతువు నిన్న
నమస్కారమే నవ్య నాగరికత నేడు !

నలుగురితో కలిసి నడుమన్నారు గతంలో
దూరం జరుగుటే ఆరోగ్యమట ప్రస్తుతం
తిరక్క మగాడు, తిరిగి ఆడది చెడతారన్న
నాలుకలే కాళ్లకు సంకెళ్ళు వేయమంటున్నాయ్ !

నా చేతికి మూతికి శతృత్వం పెంచి
హస్తానికి నాసికానికి మధ్య అగ్గి రగిల్చి
కన్నీలను చేతితో తుడవద్దంటూ హెచ్చరించి
నూతన ఆచారాలకు పురుడు పోసి
మాతో నాటకాలాడుతోంది వైరి వైరస్ !

కరోనాను ఖైదీ చేసేందుకు కదంతొక్కి
కొత్త జీవనశైలిని కఠినంగా పాటిస్తూ
కోరోనా కోవిడ్ల కోరలు కూకటివేళ్లతో పీకి
నీ ఆచూకీ లేని లోకాన్ని తిరిగి నెలకొల్పి
విశ్వకుగ్రామాన్ని భూతల స్వర్గం చేస్తాం !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## నాకనిపిస్తున్నది

కాలు కదపొద్దని కట్టడి చేశారు
తృణమో పణమో తిండిగింజలేశారు
రెక్కాడితేగాని డొక్కాడని జీవులం
సూరీడుతో పాటు పరుగెత్తే పక్షులం
వూహాన్ లో ఉమ్మితే అంటుకున్న రోగం
ఊహాకందనంతగా ఊపిరితీస్తున్నది
చంటోడికి పాలు పట్టాలంటే భయం
పెద్దోడికి పదోతరగతి పరీక్ష గండం
నిద్రలేస్తే బువ్వకెతుక్కునే బతుకులకు
ఇంటి పట్టున ఉండే అదృష్టం పట్టినా
కల్లు తాగక ఉండలేని మొగుడు
ఇల్లు వదలి వెళ్ళకుండా వున్నా
రేపమవుతాదోననే గుండె దిగులు
కరోనా కంటే భయం పుట్టిస్తున్నది
నిద్రాహారాలు మాని సేవచేసేటోళ్ళు
నిలువుగాళ్ళ మీద తిరిగే పోలీసోళ్ళు
ఆ మహమ్మారి మీద యుద్ధం చేస్తుంటే
నాకూ అనిపిస్తున్నది కూడు లేకుంటే
ఓ పూట గంజి తాగయినా సరే
ఆ కరోనాగాడికి దొరక్కుండా తిరగాలని
బ్రతికుంటే బలుసాకైనా తిని బతకొచ్చని

-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## అనివార్య యుద్ధం

ఆత్మ విశ్వాసంతో
అడుగులు వేసి
చరిత్రలో తలెత్తుకున్నోళ్లం
ఈ కరోనా ఎంత..?

సంకల్ప బలంతో
ఎన్నో మహమ్మారులను
పొలిమేరల ఆవలికి తరిమినోళ్లం
ఈ కరోనా ఏనాటి..?

మరోమారు
ఐక్యంగా యుద్ధభేరి మ్రోగించాం
కరోనా పడగల్ని ఇక
పడగొట్టడం ఖాయం..!
స్వీయ నియంత్రణ బాణాన్ని ఎక్కుపెట్టాం
కట్టడి వ్యూహాలకు పదను పెట్టాం
ఇంటినే బ్రహ్మాస్త్రంగా రూపొందించాం
సామాజిక దూరాన్ని వలగా అల్లాం
పరిశుభ్రతను ప్రాణపదం చేశాం
మరోమానవ ప్రయత్నమంటే
కర్కశత్వంపై విజయమంటే
మాదేనని నిరూపించి తీరుతాం
ప్రాణోన్మాది కరోనాకు
చెంపపెట్టులాంటి సమాధానం ఇస్తాం
ఎవరికి వారమే నిశ్శబ్ద యుద్ధం మొదలెట్టాం
ఏదో క్షణాన గెలుపును ప్రకటిస్తాం.

- తిరునగరి శ్రీనివాస్
సెల్: 8466053933

## కరోనాతో కడు జాగ్రత్త.. !

కరచాలనమే వివాదం
నమస్సులేను ప్రమోదం
చేతులే కల్పుట మనకు
కరోన వ్యాధి ప్రమాదం!

ముక్కులోననీరుకారు
శరీరమంతబేజారు..
వదలని దగ్గు జ్వరాలు
కరోనా రోగము తీరు!

తినే పద్దతి మార్చుకో
శుభ్రతనిసదా పెంచుకో
దగ్గు తుమ్ములొస్తే బహుగ
దస్తి నడ్డము పెట్టుకో!

బాగత్రాగు మంచినీరు
గొంతులున్న క్రిమి జారు
కడుపులోన చచ్చిపోయి
కరోనా బాధిక తీరు!!

చేతులు బాగా కడుకో
మాస్క్ ముఖానికేసుకో
జనం గుంపులో ఉండకు
కరోనానిల వదులుకో !

సమతుల్యపుభోజనము
సహజ వాతావరణము
చేసి తిరిగి ప్రజలకిలను
కరోనా కడు దూరము.. !



-చింతోజుపద్మావతి
8464954860

## వందనాలు

వందనాలమ్మా వందనాలు
కరోనమ్మా వందనాలు
యాడ పుట్టినావో
లోకమంతా పాకావు
మాలోన ప్రకంపనలే సృష్టిస్తున్నావు

మానవుడు ఎదుగుతూ సాగించిన
విధ్వంస రచనకి ప్రతీకార సృష్టిలో జన్మించిన కరోనమ్మా
ప్రకృతిని దూరం చేసుకుంటూ చెట్టూపుట్టా
కొండా గుట్టా ఏరూ వాగు ఏ దాన్ని వదలని
మనిషిపై రగులుతున్న ద్వేషమా! విద్వేషమా!

తల్లినీ తండ్రినీ తాత అవ్వల వదిలేసి
పోటీప్రపంచంలో ఎదగాలని
ఎలా ఎదుగుతున్నామో పరిశీలించుకోలేని
ఆత్మల సాక్షిగా ఉరుకులపరుగుల జీవితంలో కోల్పోయిన
క్షణాల బేరీజుకై సమయాన్ని మాకందజేసిన
కరోనమ్మా దండాలు !

మా ఇంటి చూర్లల్లో మెదిలాడిన ఊరపిచుక
మళ్ళీ మా ముంగిట వాలింది
మా పొలాల గట్లపై నెమలి నాట్యాలు అగుపడుతున్నాయి
ఊరు మీద పడ్డ కోతులు అడవి బాట పట్టాయి
ఎలుకపిల్లి వైరం కళ్ళముందు తచ్చాడుతుంది
పులి జింక సమరం సాక్షిగా నీతో యుద్ధం చేస్తున్నాం

నీవు విజృంభిస్తున్న ఈ క్షణంలో మేం దాక్కుంటున్నాం
నీకు ఆహారం దొరకనీయక
మా శరీరాలను దూరం దూరం పెడుతున్నాం
మా ప్రకృతి లో నిన్నణచే
పరిపుష్టి మూలాలు వెతుక్కుంటున్నాం
ఇక యుద్ధాలుండవనే జ్ఞానాన్ని పొందామూ
నీ పుట్టుక జీవసంబంధం
నా పుట్టుక జీవసంబంధం
జీవి జీవి వైరం తాత్కాలికం ప్రకృతి నేర్పిన పాఠము
బతుకువేటలో వేట అనునిత్యం
వేటగాని వలకి చిక్కక
విసుగుపెట్టించే పద్ధతే నేడు శరణ్యం.

ప్రపంచమంతా నిద్రలేని రాత్రుళ్ళు గడుపుతుంది
సంపాదంతా ఆవిరై పోతుంది
వైద్యం ప్రజల చేతుల్లోనే ఉండాలనే
ప్రాథమిక సూత్రాన్ని గుర్తు చేసావే కరోనమ్మా !
బతికుంటే చాలనుకునే వైచిత్రి
బతకాలంటే చారెడుగింజలు చాటన చెరిగే కాలం కాదిది
రోజువారీ కష్టం ద్రవ్యం రూపంలోనే చేతికందే కాలం
వస్తుమార్పిడి వ్యవస్థ మరచి ఎన్నాళ్ళయ్యిందో.

ఎవరింట్లో వారు చేసుకునే చేతివృత్తులు
పారిశ్రామీకరణ ఉచ్చులో ఉరి వేయబడి
ఉండకపోతే నేడు ఉపాధికి
లోటు ఉండేది కాదు కరోనమ్మా !
ఐనా చెక్కుచెదరని మా ఆత్మవిశ్వాసం ముందు
నువ్వు బలాదూరే !
నిన్ను సమాధి చేసి ఘోరీ కట్టడం ఖాయం సుమా!



-గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## కట్టడి చెద్దాం

అన్ని తలపులు ముంగిట
అంతర్గత వలపుల లోగిట
నిశీధిరాత్రుల నైరాశ్యమే!
ఏ దిక్కుమాలిన సూక్ష్మజీవో..
మనసుకు మనసుకు మధ్య
దూరపు గోడలు కట్టింది
నోటి మాటలకు తెరలుకట్టి
'మనఇంట్లో' మనల్నే
బందీగా చేసింది
చరవాణి చేతిలో పెట్టి
దూరవాణి కనులకు కట్టి
విద్య విహంగ రెక్కలకు
బడులను దూరం చేసి
ఇంటిలో గదులకు
పరిమితము చేసింది

ఇప్పుడు ఏ అడుగులు
ముందుకు వేయలేము
స్వైరవిహారం చేస్తున్న
మహమ్మారి కరోనా దిమ్మరికి
టపటపమని రాలుతున్న
ప్రాణాలు ఎందరో మరి!
మనం మనం దూరంగా ఉందాం
నిశ్శబ్ద యుద్ధాన్ని కట్టడి చెద్దాం.



-పగిడిపల్లి సురేందర్ పూసల
9290701508

## కరోనా ఇలా ఖతం చేద్దాం

శరీరంను శుభ్ర పర్చుకుందాం!
ధరించే దుస్తులను డెటాల్ తో శుభ్రం చేద్దాం!
శానిటరీతో చేతులు కడుగుదాం!
ఇంట్లోనే ఉందాం! ఆరోగ్యం కాపాడుకుందాం!
కాళీ కడుపుతో ఉండకుండా చూద్దాం.. !
ఉపవాసం చేయడం మానేద్దాం... !
సూర్యరశ్మితో వేడిని గ్రహిద్దాం!
వేడి నీరు త్రాగుదాం!
ఇంటిలో గుగ్గిలం హారతి కర్పూరం వెలిగించుదాం!
సురక్షితంగా ఇంట్లో ఉందాం!
పాలల్లో శొంఠి, మిరియాలు,అల్లం,బెల్లం
కలుపుకొని తాగుదాం!
చిటికెడు పసుపు కలిపిన పాలను త్రాగుదాం!
ముఖానికి ఆవిరి పడదాం!
ఆవు పిడకతో ధూపం వేద్దాం!
ఉదయం టీ లో లవంగం వేసుకొని త్రాగుదాం!
ఆహార పదార్థాలును శుభ్రం చేసి తిందాం!
పాల పాకెట్ను శుభ్రం చేద్దాం!
పరి శుభ్రతను పాటిద్దాం!
కరోనాని కట్టడి చేద్దాం!

- సి. హెచ్. సూర్యప్రకాష్
చరవాణి :8919581673

## చివరి గెలుపు మనదే!

అంతా నిశ్శబ్దం, నిర్మానుష్యం
ప్రకృతి విలయ తాండవానికి దేశాలు కకావికలం.
కారణాలు అనేకం ఎవరిని తప్పు పట్టల్లేదు.
అందరూ బాధ్యులే! లేకపోతే ఇంత నిర్లక్ష్యమా?
ప్రతి శతాబ్దానికొకమారు సృష్టి
ఘోర వైపరీత్యాలుకల్గిస్తుంటే
మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నామని చెబుతున్నా
చెవిన పేనుపారినట్లైనా లేకపోయె!
ఈ విపరీత వింత పోకడలు
వెర్రితలలు వేస్తుంటే ఇలాంటి
కరోనాలు ఎన్నైనా రావచ్చు
దాని పర్యవసానం లెక్కలేనన్ని
ప్రాణాలు బలి పెట్టాల్సి రావచ్చు!
భూదేవికున్నంత ఓర్పు ఉండాలంటారు.
చెబితే వినాలి లేకపోతే
ఇలా చూడాల్సిందే!
భూమాతకు ఎన్ని తూట్లు, ఎన్ని గాట్లు చేసిన
ఎంతగనం భరిస్తుంది.
ఓపికున్నంత వరకే
ఆ తర్వాత ఇలాంటిఘోర ప్రళయాలు జరగవచ్చు.
ఇలాంటి కరోనా మహమ్మారులు
భయత్పాతాలు సృష్టించవచ్చు.
అన్నిటికీ చికిత్సలు ఉన్నాయి.
కోవిడ్ -19 లేదు.
బయటి ప్రపంచంలో ఎప్పటి మాదిరి
విహంగవీక్షణం చేయాలంటే
అంతర్యుద్ధం ఆవాసాలమధ్యనే!
లేకుంటే స్మశానాలమధ్యనే!
కరోనా వైరస్ తో చెలగాటమొద్దు
నిప్పుతో తలగోకున్నట్లే!
మరి తలకొరివి పెట్టుకున్నట్లే!!
అందుకే! మొద్దు నిద్దురనువీడు
పరిష్కార మార్గానికై అన్వేషించు!
ఎన్ని ఓడినా చివరిగెలుపు
మనదనిమాత్రం గ్రహించు...



-వరుకోలు లక్ష్మయ్య
9704865816.

## మధురవాణి

రాముడు గొప్పని రహీమ్ గొప్పని
మతవాదులు పరస్పరం వాదులాడక తగదన్న
రామ్ రహీం ఇద్దరు ఒక్కటని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

భగవద్గీత గొప్పని ఖరాన్ గొప్పని
మతవాదులు అతిగా వాగుట తగదన్న
పవిత్ర గ్రంథాల సారం ఒక్కటని
పెద్దలు చెప్పిన మాట నిజమే.

ఈశ్వర్ గొప్పని అల్లా గొప్పని
హిందూ ముస్లిములు చెప్పుట తగదన్న
ఈశ్వర్ అల్లా ఇద్దరు ఒక్కటని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

హిందువులు వేరని ముస్లిములు వేరని
మతాల అంతరాలు సృష్టించుట తగదన్న
హిందూ ముస్లిం మతస్తులంత అన్నదమ్ములని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.



-జాధవ్ పుండలిక్ రావు,
9441333315

## పునరాలోచించు

ఓ మనిషీ !
కరోనా కథ
కంచికి
చేరే రోజు వస్తుందిలే
మరి నీ సంగతేంది
ఇవాళ కరోనా
రేపు మరో హైరానా.

నీ ఆగడాలకు హద్దుందా
నీ చర్యలకు విరమణుందా
కరోనాని రాకాసి అంటావు
మహమ్మారి అని దండోరా వేస్తావు
మరి నీలోని రాక్షసత్వాన్ని గూర్చి
ఒక్కసారైనా
తరచి చూసుకున్నావా
ఒక్కసారి
ఒకే ఒక్కసారి ఆలోచించు
వెనుదిరిగి పునరాలోచించు.

ఒక జీవిని ఇంకో జీవి తినడం
జీవవైవిధ్యంలో భాగమే
అది సృష్టి నిర్మాణ రీత్యా సహజమే
అలాగని
సకల జీవరాశి నీ సొత్తే అంటే ఎలా
గబ్బిలాలు ఎలుకలు పాములు..
జీవవైవిధ్యాన్ని విధ్వంసం చేస్తున్న
నీ జీవన విధానం మార్చుకోకుంటే
కరోనాలేమిటి
ఎన్ని హైరానాలయినా పుడతాయి
పుడుతూనే ఉంటాయి..

జర భద్రం మరి
మంచి ఆహార నియమాలు పాటిస్తూ
ముందుకు సాగిపో
లేదంటే నిన్ను మింగడానికి
కోట్ల కొలది కరోనాలు
బిలియన్ల కొలది హైరానాలు
వేచి ఉంటాయిలే



- ఉప్పల పద్మ
చరవాణి :8340933244

## మాయ కరోనా

ఎక్కడి మాయా రోగము?
ఎక్కడి విపరీత వైరసెట్టుల వచ్చెన్?
పెక్కురి ప్రాణము దీసెను
మిక్కిలిగా బాధ పెట్టె మేదిని జనులన్ !

కనివిని ఎరుగని రోగము
జనులందరు వణుకుచుండె చావు భయముతో
కనుగొనలేదౌషధమును
మనుగడ సాధించుటెట్లు మాయ కరోనా !

కంటికి కానని పురుగువి
ఇంటికి మము ఖైదుజేసి ఏడ్పించితివే
ఒంటరి వాళ్లను చేస్తివి
మంట కలిసి పోవె నీవు మాయ కరోనా!

చేయని తప్పుకు శిక్షను
వేయగ నువు బూనినావు వేధించకుమా
హాయిగ బ్రతికెడి జనులను
వేయించుకు తినకు నీవు వెళ్ళు కరోనా !

అమ్మా కరుణను జూపుము
పోమ్మా ఈ పుడమినుండి పూర్తిగనిపుడే
కమ్మెను విషాదమంతట
మమ్ము వదిలి పోవె నీవు మాయ కరోనా !



-సాగర్ల సతయ్య
సెల్: 7989117415

## కాటికి కరోన

వైరస్ కరోన కదలక మెదలక
భూస్థాపిమైపో
మానవాళి మనుగడకు
ప్రపంచ అభివృద్ధికి అడ్డంకి కాకు
దేశాలకు పాకి
మృత్యుగంటిక మోగిస్తున్నావు
చిన్నారుల వృద్ధుల పాలిట పామై కాటేయకు
నీవల్ల ప్రాణనష్టం ఆర్థిక నష్టం
మానసిక మనోబలం
మానవాళి కోల్పోయి ఆక్రోశిస్తుంది
కరచాలనాలు మరచి
దూరాలు పాటించి
హోమ్ అరెస్టు అయ్యింది
వర్క్ ఫ్రం హోమ్ క్వారంటైన్
పదాలకు ప్రాధాన్యం ఏర్పడేలా చేసింది.
కరతాళ ధ్వనులు వెలుగు దివ్వెలు
మోగించి వెలిగించి
భారత ప్రజల ఐక్యత చాటేల చేసింది
కాళ్లుకడగటం గడపకు పసుపు రాయటం
మంచి అలవాట్లు నేర్చుకొనెలా చేసింది.
నీ భయం వల్ల కరోన
కరోన కదలక మెదలక
ఈ ప్రపంచ మానవాళి ప్రశాంతతను
భగ్నం చేయక భస్మం అయిపో
ఇదే మానవాళి కోరిక కరోన
ఇదే సమస్తమానవాళి
కాంతి సమరం కరోన

-సంధ్య సుత్రావె
9177615967

